

ఎండీయూ వాహనం వద్ద బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

బియ్యం ఇచ్చి.. అన్నీ ఎగ్గొట్టి..!

- రేషన్ సరుకుల్లో కోతలు..
- నామమాత్రంగా పంపిణీ
- పామాయిల్, గోధుమలు కనుమరుగు
- లబ్ధిదారులపై పెరిగిన నెలవారీ ఆర్థిక భారం
- పౌరసరఫరాల వ్యవస్థ నిర్వీర్యం



టీడీపీ హయాంలో సబ్సిడీ సరుకుల దుకాణాలు మినీ మాల్స్‌లా ఉండేవి. బియ్యం, పంచదార, పామాయిల్, గోధుమ, కందిపప్పుతో పాటు ప్రజలకు అవసరమైన పలురకాల వస్తువుల విక్రయాలతో కళకళలాడేవి. మార్కెట్ కంటే తక్కువ ధరకు ఉప్పుపప్పుల నుంచి సబ్బులు, నూనెలు, గోధుమపిండి తదితర సరకులు అందుబాటులో ఉండేవి. పెరిగిన ధరలతో కొనుగోలు చేయలేక ఇబ్బంది పడే సరుకులను కూడా సబ్సిడీతో కార్డుదారులకు ప్రభుత్వం అందించేది. పండుగ సమయాల్లో ప్రత్యేకంగా సరుకులను చౌకదుకాణాల ద్వారా కానుకుల రూపంలో పంపిణీ చేసేవారు. వైసీపీ అధికారం చేపట్టిన తరువాత రేషన్ వ్యవస్థను సంస్కరిస్తున్నామంటూ భ్రష్టు పట్టించారు. రేషన్ అంటే బియ్యం మాత్రమే అన్నట్టుగా మార్చేసింది. కందిపప్పు, పంచదార అరకొరగానే పంపిణీ చేస్తున్నారు. మార్కెట్‌లో అందుబాటులో లేకుండా విపరీతంగా ధరలు పెరిగిపోయి, సామాన్యులు విలవిల్లాడుతున్నా తమకు సంబంధం లేదన్నట్టుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆయా సరుకులను సబ్సిడీపై అందించాలన్న కనీస ఆలోచన చేయడం లేదు. ఇలా పౌరసరఫరాల వ్యవస్థను నిర్వీర్యం చేయడంపై విమర్శలు వస్తున్నా.. వైసీపీ పాలకులు పట్టించుకోవడం లేదు. - ధర్మవరం



ఇంటికే వచ్చి రేషన్ బియ్యం అందజేస్తాం అంటూ ప్రకటనలు చేసిన ప్రభుత్వం ఆచరణలో పౌరసరఫరాల వ్యవస్థను కోలుకోలేనంతగా దెబ్బతీసింది. ఐదేళ్ల క్రితం తొలిసారిగా మొబైల్ డిస్పెన్సరీ వాహనాలతో హడావుడి చేసింది. ఆ పేరుతో అప్పటి వరకూ పేదలకు అందే నిత్యావసర సరుకులను వారికి ఇవ్వకుండా చేసిందన్న విమర్శలు వచ్చాయి. బియ్యం, పంచదార, కందిపప్పు, పామాయిల్, గోధమపిండి తదితర సరుకుల పంపిణీని మరచింది. కరోనా తరువాత నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న బియ్యం మాత్రమే పంపిణీ చేస్తోంది. కందిపప్పు నూటికి 30 కుటుంబాలకు గోధుమపిండి నూటికి 15 కుటుంబాలకు మాత్రమే అందుతోంది. దీంతో లబ్ధిదారులపై నెలవారీ ఆర్థిక భారం విపరీతంగా పెరిగిపోయింది. జిల్లాలో 5.50 లక్షలదాకా రేషన్‌కార్డులున్నాయి. ప్రతినెలా మనిషికి 5 కిలోల బియ్యంతోపాటు అరకిలో పంచదార, కిలో కందిపప్పు చౌక ధరలకు అందించేవారు. వైసీపీ ప్రభుత్వం క్రమంగా వాటిని తగ్గిస్తూ వచ్చింది. బియ్యం మినహా సరుకుల పంపిణీలో రకరకాల కారణాలతో కోత విధించింది. 2022 నుంచి పంచదార, కందిపప్పు సరఫరా పడిపోయింది. కందిపప్పు సరఫరా మూడొంతులు తగ్గింది. ఎన్నికలు సమీపించే సమయానికి లబ్ధిదారులను ఆకట్టుకోవాలనే ప్రయత్నంలో భాగంగా తిరిగి కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పండుగ నెలలైన డిసెంబరు, జనవరిలో కూడా కార్డుదారులకు కందిపప్పు అందించలేక అభాసుపాలైంది. గోధమపిండి సరఫరా చేస్తామని హడావుడి చేసిన ప్రభుత్వం అనంతరం చేతులెత్తేసింది. నూటికి 15 కుటుంబాలకు కూడా గోధమపిండి సరఫరా చేయలేకపోతోంది. ఒకానొక దశలో నెలల తరబడి అరకిలో పంచదార కూడా సరఫరా చేయలేక పోయిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించుకోవచ్చు.

టీడీపీ హయాంలో 9 సరుకులు ఇచ్చేవారు..

టీడీపీ హయాంలో బియ్యంతోపాటు పంచదార, పామాయిల్, గోధుమపిండి, కందిపప్పు, సబ్బులు తదితర సరుకులు ఇచ్చేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక బియ్యం, పంచదారతో సరిపెడుతున్నారు. కందిపప్పు ఇవ్వక ఆరునెలలు దాటింది. కందిపప్పును మార్కెట్‌లో అధిక ధర వెచ్చించి, కొనుగోలు చేస్తున్నాం.

- అనంతమ్మ, ముదిగుబ్బ



పేదల కడుపుకొట్టిన వైసీపీ

కోతలతోపాటు పెరిగిన ధరలు

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకూ రేషన్ సరుకుల్లో భారీగా కోత పడింది. టీడీపీ హయాంలో 2018 మార్చి నుంచి ఒక్కో కుటుంబానికి 2 కిలోల కందిపప్పు రూ.40 చొప్పున ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం అందులో కోత పెట్టి, కిలోకి తగ్గించింది. ధరను రూ.40 నుంచి రూ.67కి పెంచింది. ఆ రేటుకీ లబ్ధిదారులకు ఇవ్వడంలేదు. టీడీపీ హయాంలో ఒక్కో కుటుంబానికి కిలో పంచదార రూ.20 చొప్పున అందించేది. దాన్ని అరకిలోకి తగ్గించి, రూ.17 వసూలు చేస్తోంది. అంటే కిలోపై రూ.14 పెంచినా అరకొరగానే సరఫరా చేస్తున్నారు. 2018-19లో రాగులు, జొన్నలు, గోధుమపిండి, ఉప్పు తదితరాలను లబ్ధిదారులకు రేషన్ సరుకులతోపాటు పంపిణీ చేశారు. పండుగ సమయాల్లో నూనె ధరలు అధికంగా ఉన్నపుడు పామాయిల్‌ను సబ్సిడీ ద్వారా కిలో రూ.40కి పంపిణీ చేసేవారు. ప్రస్తుతం వంటనూనెల ధరలు మూడంకెల సంఖ్యను దాటినా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం వంటనూనె ఇచ్చిన దాఖలాలులేవు. పైపెచ్చు ఏటా సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ పండుగలకు ఇచ్చే కానుకలు, తోఫాను పూర్తిగా ఆపేసి, చేతులు దులుపుకుంది.

సామాన్యులపై పెరిగిన భారం

బడుగు బలహీనవర్గాల ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులే ఆధారం. సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఇవి వారికి ఆసరాగా ఉండేవి. పేదల ఆకలి తీర్చేవి. ప్రభుత్వం పౌర సరఫరాల వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేసి కోలుకోలేనంతగా దెబ్బతీసింది. వంద మందిలో పది మందికి ఒకటి, అరా.. సరుకులు ఇచ్చి చేతులు దులుపుకుంటోంది. దీంతో వారంతా బహిరంగ మార్కెట్‌లో సరుకులను కొనుక్కోవాల్సి వస్తోంది. ఫలితంగా ఒక్కో కుటుంబంపై సగటున నెలకు రూ.500 నుంచి రూ.1000 వరకు అదనపు భారం పడుతోంది. ఈ భారం మోయలేక సామాన్య,పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగం ఆదర్శం

కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శమని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు కొనియాడారు. స్థానిక కలెక్టరేట్‌లో ఆదివారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ అరుణ్‌బాబు పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగాన్ని రచించారన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, సాంఘిక సంక్షేమ శాఖాధికారి శివరంగప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మావతి, గిరిజన, బీసీ సంక్షేమ శాఖల అధికారులు మోహన్‌రావు, నిర్మలాజ్యోతి, ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు



సంగీత కచేరి నిర్వహిస్తున్న సాయిభక్తులు



ఘనంగా కేరళ నూతన సంవత్సర వేడుకలు

పుట్టపర్తి ఏప్రిల్ 14: ప్రశాంతినిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో కేరళ నూతన సంవత్సర వేడుకలను ఆ రాష్ట్ర భక్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి మహాసమాదిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వేదపఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. రేజునారాయణ బృందం కేరళ సాంప్రదాయరీతిలో సంగీత కచేరి నిర్వహించారు. అనంతరం సత్యసాయి మహాసమాదిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆ రాష్ట్ర భక్తులు వేలాదిమంది పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా వడ్డె అంజినప్ప



వడ్డె అంజినప్ప

పుట్టపర్తి, ఏప్రిల్14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా అంజినప్పను ఎంపిక చేశారు. ఈ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. హిందూపురం మున్సిపాలిటీ పరిధి కొల్లకుంటకు చెందిన వడ్డె అంజినప్ప టీడీపీలో మూడున్నర దశాబ్దాలుగా క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. టీడీపీ కొల్లకుంట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరువాత హిందూపురం పట్టణ అధ్యక్షుడిగా కొనసాగారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తున్నారు. పార్టీలో నిబద్ధత కలిగిన నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను జిల్లా అధ్యక్షుడిగా టీడీపీ అధిష్టానం ఎంపిక చేసింది. బీసీ వర్గానికి చెందిన అంజినప్ప నియామకం పట్ల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం పట్ల టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడుతోపాటు జిల్లా జిల్లా నేతలు, కార్యకర్తలకు అంజినప్ప ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో అన్నివర్గాలను కలుపుకొని పార్టీ అభ్యర్థుల విజయానికి కృషిచేస్తానని తెలిపారు.

రాష్ట్ర కమిటీలో ఇద్దరు కదిరి వాసులకు చోటు

టీడీపీ రాష్ట్ర కమిటీలో కదిరి నుంచి ఇద్దరికి చోటు లభించింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా పీవీ పవన్‌కుమార్‌రెడ్డిని, కార్యదర్శిగా గాజుల శివరాం ప్రతాప్‌ను నియమించారు.

ప్రాంతం	పుట్టపర్తి	కదిరి	ధర్మవరం	హిందూపురం	పెనుకొండ
గరిష్ఠం కనిష్ఠం	38.0 23.0	37.0 23.0	39.0 24.0	37.0 22.0	37.0 23.0

ఖాకీ నాటకం..!





తనిఖీల్లో కాదు.. బ్యాంకుల వద్ద పట్టివేత..

హడలెత్తుతున్న సామాన్యులు

హిందూపురం, ఏప్రిల్ 14: ఎన్నికల కోడ్ సాకుతో పోలీసులు కొత్త నాటకానికి తెరలేపారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కోడ్ నిబంధనలను ఆసరాగా తీసుకుని, సామాన్యులకు చుక్కలు చూపుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం 50 వేలకు మించి నగదు వెంట తీసుకెళ్లకూడదు. అలా తీసుకెళ్తే అందుకు సంబంధించిన బిల్లులుకానీ, పత్రాలుకానీ చూపాలి. ఇక్కడే కొందరు ఖాకీలు కొత్త నాటకానికి తెరలేపారు. రాష్ట్రంలోనే హిందూపురం వాణిజ్య కేంద్రంగా పేరుగాంచింది. నిత్యం కోట్లాది రూపాయల వ్యాపారాలు సాగుతుంటాయి. అలాంటపుడు వందలాది మంది వ్యాపారులు నగదు తీసుకెళ్లడం, జమచేయడం జరుగుతుంటుంది.

బ్యాంకుల వద్దే..

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక ఎంసీసీ టీమ్ ప్రత్యేక టీమ్‌లు తిరుగుతుంటాయి. వీరు అనుమానం వచ్చిన చోట వాహనాలు ఆపి వారి వద్ద నగదు, ఇతర వస్తువులు దొరికితే వాటికి సంబంధించి బిల్లులు చూపితే వదిలేయాలి. ఒకవేళ చూపకపోతే వాటిని త్రిసభ్య కమిటీకి పంపుతారు. ఆ తరువాత నగదు తీసుకెళ్తున్న వ్యక్తులు సంబంధిత పత్రాలు, బిల్లులు చూపి కలెక్టర్ వద్ద నగదు పొందవచ్చు. హిందూపురంలో చాలామంది వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి వారి ఖాతాలకు జమ చేస్తుంటారు. అలాంటపుడు వారు బ్యాంకులోకి వెళ్లి నగదు డ్రా చేసుకుని ఇంటికి వెళ్తుంటారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక కొన్నిచోట్ల తనిఖీలు నిర్వహిస్తుంటారు. ఆ తనిఖీల్లో పట్టుబడితే నగదును సీజ్‌చేసి ఎక్కువ మొత్తంలో ఉంటే ఐటీ అధికారులకు అప్పగిస్తారు. తక్కువగా ఉంటే కలెక్టర్ త్రిసభ్య కమిటీకి పంపుతారు. వారు పరిశీలించి బిల్లులు చూశాక ఒకటి రెండు రోజుల్లోనే నగదు వెనక్కు ఇవ్వాలి. పోలీసులు, రెవెన్యూ అధికారులు, మరో శాఖ అధికారి కలిసి తనిఖీలు నిర్వహిస్తుంటారు. హిందూపురంలో పోలీసులు మాత్రమే తనిఖీల్లో కాకుండా బ్యాంకుల వద్దకు వెళ్లి అక్కడ ఎవరైనా నగదు డ్రా చేస్తుంటే వారిపై నిఘా ఉంచి బ్యాంకు నుంచి బయటకు వచ్చాక వారి వద్ద నగదు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలిస్తున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు.

పోలీసుల కొత్త ఎత్తుగడ

ఎక్కడాలేని విధంగా హిందూపురంలో పోలీసులు ఎన్నికల కోడ్ అడ్డం పెట్టుకుని కొత్త ఎత్తులు వేస్తున్నారు. బ్యాంకుల వద్ద కొంతమంది మఫ్టీలో ఉన్న పోలీసులు నిఘా ఉంచుతారు. ఎవరైనా డబ్బు డ్రా చేసుకుని బయటికి వస్తే ఆ సమాచారం ఇతర పోలీసులకు చెప్పి, వారి వద్ద నగదు తనిఖీచేసి దానిని పోలీసు స్టేషన్‌కు తరలిస్తున్నారు. ఇటీవల కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యుల్లో ఒకరు అనారోగ్యం బారినపడడంతో హిందూపురం వచ్చి తన స్నేహితుల ద్వారా ఇక్కడ నగదు బదిలీ చేయించుకుని డ్రా చేసుకున్నాడు. బయటికి వచ్చాక నగదును స్వాధీనం చేసుకుని, సీజ్ చేశారు. ఆ నగదు ఎందుకు తీసుకెళ్తున్నానో చెప్పినా.. పట్టించుకోకుండా స్టేషన్‌కు తీసుకెళ్లారు. ముద్దిరెడ్డిపల్లికి చెందిన ఓ చీరల వ్యాపారికి చీరలు అమ్మిన వ్యక్తి నుంచి నగదు పంపారు. దానిని డ్రా చేసుకుని వెళ్తుండగా మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు రావాలంటూ వత్తిడి తెచ్చారు. ఆయన పట్టుకున్నవారికి కొంతమొత్తం చెల్లించుకుని డబ్బు ఇంటికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. ఇటీవల ఓ వ్యక్తి తన స్థలాన్ని అమ్ముకుని, కొనుగోలు చేసిన వారి నుంచి బ్యాంకు వద్ద డ్రా చేసుకుని తీసుకెళ్తుండగా చూసిన పోలీసులు బయటకు రాగానే నగదు స్వాధీనం చేసుకుని, స్టేషన్‌కు తరలించారు. ఇలాంటివి రోజుకు ఒకటి రెండు జరుగుతున్నట్లు సమాచారం. కొంతమంది పోలీసులు మఫ్టీలో బ్యాంకులవద్ద నిఘా ఉంచారు. బ్యాంకులవద్ద నగదు పట్టుకోవడం ఏంటని సామాన్యులు మండిపడుతున్నారు. సరిహద్దు నుంచి అక్రమ మద్యం, రాజకీయ పార్టీలకు కావాల్సిన వాటిని యథేచ్ఛగా తరలించుకుంటున్నారు. వాటిని పట్టుకోవాల్సిందిపోయి సామాన్యులపై గురిపెట్టడం ఏంటని పోలీసులపై మండిపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో మాత్రమే పట్టుకున్న నగదు స్టేషన్‌కు తీసుకెళ్లి మీడియాకు సమాచారం ఇస్తున్నారు. చాలా వాటికి పట్టుకుని వదిలేస్తున్నట్లు సమాచారం. అసలు నగదు పట్టుకుని వదిలేయడం ఏంటన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కంకర పరిచారు.. వదిలేశారు



కంకర తోలి వదిలేసిన విరుపసముద్రం రోడ్డు

- అమరాపురం - విరుపసముద్రం రోడ్డుకు రూ.24 కోట్లు
- చేసిన పనులకు రూ.2.5 కోట్ల దాకా అందాల్సిన బిల్లులు
- ప్రయాణం నరకం.. మరమ్మతులు కరువు
- నిత్యం ప్రమాదాలు.. ప్రయాణికుల ఇబ్బందులు

మడకశిర, ఏప్రిల్ 14: కోట్లాది రూపాయలు వ్యయం చేసి చేపట్టిన రోడ్లు వర్షాలకు దెబ్బతిని కంకరతేలి గుంతలమయమయ్యాయి. దీంతో తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపడమే కానీ నిధులు మాత్రం మంజూరు కావడం లేదు. రహదారి సౌకర్యం కల్పించాలని రోడ్డుపై బైఠాయించి ఆందోళనలు చేసినా ఫలితం లేకుండా పోయిందని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు వస్తే పలు గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా ఇబ్బంది పడాల్సివస్తోంది. ఇప్పటి వరకు ఆయా ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు మర్మతులు, కాలువల మధ్యలో బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టలేదు. రొళ్ల మండలంలో బిజిహళ్లి, హెచ్‌టీ హళ్లి సమీపంలో వంకలు పారితే పాఠశాలలకు వెళ్లడానికి విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 15 సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మడకశిర మండలంలోని వైబీహళ్లి నుంచి మడకశిరకు వచ్చే రోడ్డు మార్గంలో వంతెన నిర్మించాల్సి ఉంది. వంక పారితే రాక పోకలు నిలిచిపోతున్నాయి. వంతెన నిర్మించాలని ఆందోళన చేపట్టి గ్రామం చుట్టూ ఉన్న రహదారులకు కంచె వేసి ఆందోళన చేపట్టినా ఫలితం లేకుండా పోయిందని ఆ గ్రామ ప్రజలు తెలిపారు. గురుపుకొండ తండా కాలనీకి వెళ్లడానికి రహదారి సౌకర్యం కల్పించాలని కాలనీ వాసులు కదిరేపల్లికి తరలి వచ్చి అమరాపురం, మడకశిర ప్రధాన రహదారిపై బైఠాయించి ఆందోళనకు దిగారు. 50 సంవత్సరాలుగా కాలనీకి వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఉండేదని, రాక పోకలను కొనసాగించే వారమని, రెవిన్యూ రికార్డుల్లో కూడా ఉందని గ్రామస్థులు అంటున్నారు. కొందరు ఆ రహదారిని కొందరు తమ ఆధీనంలోకి తీసుకుని రాకపోకలు లేకుండా చేస్తున్నారని తెలిపారు. అమరాపురం - విరుపసముద్రం రోడ్డుకు 8 కిలో మీటర్లకు గాను రూ.24కోట్లు మంజూరయింది. పనులు ప్రారంభమైన కొద్ది రోజులకే నిలిచిపోయాయి. చేసిన పనులకు రూ.2.5 కోట్ల దాకా బిల్లు చెల్లించాల్సి ఉంది. ఆర్అండ్‌బీ, పీఆర్ పరిధిలో కొన్ని చోట్ల వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతలమయమయ్యాయి. వాటికి తాత్కాలిక మర్మతులు చేపట్టినా మూన్నాళ్ల ముచ్చటే అయ్యాయి. ఆ రోడ్ల గుండా ప్రయాణం చేయాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని వాహనదారులు పేర్కొంటున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందన్నారు. తరచూ వాహనాలు ఆ గుంతల్లో ఇరుక్కోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రమాదాలు జరిగి కొంత మంది క్షతగాత్రులయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆ రోడ్లలోని గుంతలకు తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. కొద్ది రోజులకే దెబ్బతిని కంకర తేలడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

రోడ్డుకు రూ.24 కోట్లు

అమరాపురం - విరుపసముద్రం రోడ్డుకు రూ.24 కోట్లు మంజూరయ్యాయి. ఆర్అండ్‌బీ శాఖ టెండర్లు పిలిచి పనులు కూడా ప్రాంభించింది. 8 కిలో మీటర్లకు రూ. 24 కోట్లు కేటాయించారు. 4కిలో మీటర్ల మేర కంకర పరిచి వదిలేశారు. పనులు నిలిచిపోయి రెండు సంవత్సరాలు కావస్తోంది. ఆ రెండు ప్రాంతాల వారు ఆ రోడ్డు గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు మూడు కోట్ల రూపాయలు వరకు పనులు జరిగాయి. చేసిన పనులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని సమాచారం.

హైవే పరిధిలోకి మారినా అదే దుస్థితి

పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్అండ్‌బీ పరిధిలోకి, ఆర్అండ్‌బీ నుంచి హైవే పరిధిలోకి మారినా ఆ రోడ్ల రూపురేఖలు మాత్రం మారలేదు. కొడికొండ నుంచి హిందూపురం, మడకశిర మీదుగా రొళ్ల, శిరా వరకు జాతీయ రహదారి పనులు పూర్తయ్యాయి. పావగడ, మధుగిరి రోడ్డు ఆర్అండ్‌బీ పరిధి నుంచి హైవే పరిధిలోకి మారింది. పావగడ రోడ్డు కూడా వర్షాలకు దెబ్బతిని గుంతఏర్పడింది. అదే విధంగా కింద బస్టాండు సర్కిల్లో పెద్ద గుంత పడినా ఇప్పటి వరకు దాన్ని మర్మతు చేపట్టలేదు దీంతో తరుచూ వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్ల మర్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రూ.2.5 కోట్ల దాకా బకాయి

అమరాపురం- విరుపసముద్రం రహదారి 8 కిలో మీటర్లకుగాను రూ.24 కోట్లు మంజూరైంది. దాదాపు రూ. 3 కోట్ల దాకా పనులు జరిగాయి. 2.5 కోట్ల దాకా బిల్లులు చెల్లించాల్సి ఉంది. - లక్ష్మీనారాయణ, ఆర్అండ్‌బి, ఏఈ



రహదారి కోసం ఆందోళన చేస్తున్న గుర్రపుకొండ తండా వాసులు (ఫైల్)



గోరంట్లలో ర్యాలీ చేస్తున్న ఐటీ ఉద్యోగులు

కదిలొచ్చిన ఐటీ ఉద్యోగులు

గోరంట్ల, ఏప్రిల్ 14: బెంగుళూరు ఐటీ ఉద్యోగుల ఫోరం ఆధ్వర్యంలో టీడీపీకి మద్దతుగా ఆదివారం గోరంట్లలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ప్రధాన రహదారిపై పార్టీ కార్యాలయం వరకు మంచిరోజులు వచ్చేస్తున్నాయంటూ ప్లకార్డులు పట్టుకుని, ర్యాలీ చేశారు. 'హలో ఏపీ.. బాయ్.. బాయ్.. వైసీపీ, బాబు వస్తేనే జాబ్ వస్తుంది, రాజారెడ్డి రాజ్యాంగం వద్దు, అంబేడ్కర్ రాజ్యాంగం ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ర్యాలీ అనంతరం పెనుకొండ నియోజకవర్గంలోని మండలాల్లో ప్రజలను కలిసి ఐటీ రంగాభివృద్ధికి చంద్రబాబు చేసిన కృషిని వివరించారు. టీడీపీ కోసం ప్రచారం చేస్తామని ఐటీ ఉద్యోగుల ఫోరం సభ్యులు పేర్కొన్నారు. ర్యాలీలో పెనుకొండ కూటమి అభ్యర్థి సవిత, నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు, నాయకులు బీకే సాయికుల్యాణ్, నిమ్మల చంద్రశేఖర్, ఐటి తెలుగు ప్రొఫెషనల్ విభాగం, తెలుగుయువత, ఐటీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దాడిపై సీబీఐతో విచారణ చేయించాలి

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



ఉరవకొండ, ఏప్రిల్ 14: సీబీఐతో విచారణ జరిపిస్తే అసలు దొంగలు ఎవరో బయటపడతారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డిపై రాయితో దాడి జరిగిన నేపథ్యంలో పయ్యావుల కేశవ్ ఆదివారం ఉరవకొండలో మాట్లాడారు. వైసీపీ సోషల్ మీడియా నడిపే వ్యక్తి నాగులు రోజుల క్రితమే సంచలన సంఘటనలు జరగనున్నాయని పేర్కొన్నారన్నారు. ఎన్నికల మూడ్‌నే మార్చేస్తాయని ట్వీట్ చేయడం జరిగిందన్నారు. శ్రీధర్‌రెడ్డికి ముందే ఈ విషయం ఎలా తెలుసో పోలీసులు విచారించాలన్నారు. మూడువేల మంది పోలీసుల నడుమ సీఎం రోడ్‌షో సాగిందని, ఈ దాడిని టీడీపీపైన నెట్టడానికి సిగ్గనిపించడంలేదా అని ప్రశ్నించారు. గొడ్డలిపోటు, కోడికత్తి, గుళకరాయి డ్రామాలు ఆడుతున్నారన్నారు. వైసీపీ డ్రామాలు, నాటకాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

విజయవాడ పోలీసు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

● మాజీ మంత్రి కాలవ డిమాండ్



రాయదుర్గం, ఏప్రిల్ 14: సీఎం జగన్‌పై జరిగిన గులకరాయి దాడిలో విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతి రాణాటాటాను భద్రతా వైఫల్యానికి బాధ్యుడిని చేసి ఎన్నికల కమిషన్ తక్షణమే సస్పెండ్ చేయాలని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి అత్యంత కట్టుదిట్టమైన భద్రత వలయం మధ్య ఉంటారన్నారు. అటువంటి వ్యక్తిపై ఎవరో ఒక వ్యక్తి రాయి విసిరారంటే దీన్ని ఘోరమైన భద్రతా వైఫల్యం కిందనే చూడాల్సి ఉంటుందన్నారు. జగన్ కావాలనే రాయితో వేయించుకున్నాడా, మరో కోడికత్తి డ్రామాకు తెరతీశాడా అనేది విచారణలో తేలాల్సిన అంశమన్నారు. 2019 ఎన్నికల ముందు కోడికత్తి డ్రామా ఆడి దళిత యువకుడి జీవితాన్ని జగన్ నాశనం చేశాడన్నారు. కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉన్న ముఖ్యమంత్రిపై రాయి విసిరిన వ్యక్తిని ఇప్పటివరకు ఎందుకు పట్టుకోలేదని నిలదీశారు.

కోడి కత్తి... గులకరాయి సేమ్ టు సేమ్

● టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు



అనంతపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ కోడికత్తి డ్రామా ఎలా రక్తికట్టించారో... సీఎం హోదాలో గులకరాయి డ్రామాను అదే స్థాయిలో రక్తికట్టించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీవీ వెంకటరాముడు ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సానుభూతి కోసమే ఈ డ్రామాలన్నీ అని ఆరోపించారు. ఆదివారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ అనుభవరాహిత్యం, అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన వ్యక్తి వైఎస్ జగన్ అని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో జగన్‌పై ప్రజల్లో నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలోనే కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. గొడ్డలి వేటు... కోడికత్తి డ్రామాలు ప్రజలకు అర్థమైపోవడంతో తాజాగా గులకరాయి దాడి డ్రామాకు జగన్ తెరలేపాడని ఆరోపించారు.

సీఎం మరో జగన్నాటకానికి తెరలేపారు

● ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



అనంతపురం అర్బన్, ఏప్రిల్ 14: సీఎం జగన్ మరో జగన్నాటకానికి తెరలేపారని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం అనంతపురం నగరంలోని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు వివేకా హత్య, కోడి కత్తి కేసుల తరహాలోనే ఈ ఎన్నికలకు ముందు జగన్‌పై రాళ్ల దాడి మరో నాటకమన్నారు. దీనికి రాష్ట్ర పోలీసులు బాధ్యత వహించాలన్నారు. బాధ్యతారహితంగా ఉన్న పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్నాటకానికి సానుభూతి చూసే పరిస్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు.

గులకరాయితో మరో మోసం: కందికుంట



కదిరి, ఏప్రిల్ 14: సీఎం వైఎస్ జగన్ మరో మారు గులకరాయి పేరు తో కొత్త నాటకానికి తెరలేపారని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో కోడికత్తి, బాబాయ్ హత్యతో సానుభూతి పొంది అధికారంలోకి వచ్చిన జగన్ ఈసారి గులకరాయి పేరుతో సానుభూతి పొందాలని చూస్తున్నారన్నారు.ఆయన డ్రామాలను నమ్మేవారు ఎవరూ లేరన్నారు. ముఖ్యమంత్రికి అత్యంత భద్రత ఉంటుందని, అదే సభలో నాలుగైదుమార్లు కరెంటు పోయిందని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిపై రాళ్లదాడి జరిగితే, పోలీసులు ఏమిచేస్తున్నారని ప్రశ్నించారు. ఇది జగన్నాటకమా, పోలీసుల వైఫల్యామా అనేది తేల్చాలన్నారు. ముఖ్యమంత్రి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కందికుంట మండిపడ్డారు.

ప్రజల సానుభూతి కోసమే: సవిత



పెనుకొండ టౌన్, ఏప్రిల్ 14: అధికార దాహంతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసేందుకు నాడు కోడికత్తి డ్రామా ఆడి నేడు గుళకరాయిదాడి అని అంటున్నారని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో గుళకరాయి డ్రామాకు తెరలేపారన్నారు. జగన్‌పై రాయితో దాడి ప్రజల సానుభూతి కుట్రలో భాగమేనన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయం వైసీపీకి పుట్టుకుందని ఈ దాడితోనైనా ప్రజల్లో సానుభూతి పొందవచ్చని డ్రామా ఆడుతున్నారన్నారు. ఇలాంటి డ్రామా ఆర్టిస్ట్ అయిన ముఖ్యమంత్రి రాష్ట్రానికి అవసరమా అన్నారు. ఈ రాళ్లదాడి ఒక బూటకమని, సైకోజగన్ నక్కజిత్తుల పన్నాగమని, ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

రాళ్ల దాడి.. జగన్నాటకమే..!

కూటమి అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 14: సిద్ధం బస్సు యాత్రకు జనం నుంచి స్పందనలేకపోవడంతో సీఎం జగన్ రాళ్ల దాడి డ్రామాలు ఆడుతున్నారని, జగన్నాటకంలో అదో భాగమని దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి, బాబాయ్ వివేకా హత్య పేరుతో డ్రామాలు ఆడి సానుభూతి పొందారన్నారు. ఇప్పుడు ఎన్నిక లకు ముందు రాళ్ల దాడిపేరుతో మరో కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. కరెంటు లేని సమయంలో సరిగ్గా కంటిపై భాగాన ఎలా దాడి చేశారని ప్రశ్నించారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, జగన్ మాయమాటలు నమ్మే పరిస్థితుల్లో వారు లేరని అన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌పై.. తికమక..!



● ఒక్కోచోట ఒక్కో రకంగా అధికారుల నిర్ణయాలు
● దరఖాస్తుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు దూరం
● ఉన్నతాధికారుల తీరుపై అసహనం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 14: ఎన్నికల నిర్వహణలో పోలింగ్ సిబ్బంది పనితీరే చాలా కీలకం. ఉన్నతాధికారులు ఆదేశాలిస్తే క్షేత్రస్థాయిలో వాటిని పక్కాగా అమలు చేసి ఎన్నికల నిర్వహణను విజయవంతం చేసేది పోలింగ్ సిబ్బందే. అలాంటి సిబ్బంది ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే పోస్టల్ బ్యాలెట్లపై తికమకపడుతున్నారు. చాలామంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఓటుకు దరకాస్తు చేసుకోలేకపోతున్నారు. ఒక్కో నియోజకవర్గంలో ఒక్కోరకంగా ఎన్నికల అధికారులు నిర్ణయాలు తీసుకుంటుండడంతో సమస్యలు ఏర్పడుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. చివరకు వీటిని పర్యవేక్షించే జిల్లా ఉన్నతాధికారులు సైతం పట్టించుకోకపోవడం, పోస్టల్‌బ్యాలెట్ వినియోగం విధానాలపై కనీసం ప్రచారమాధ్యమాల ద్వారా తెలియజేయకపోవడం మరిన్ని విమర్శలకు తావిస్తోంది.

ఎన్నికల డ్యూటీలో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో ఎన్నికలు నిర్వహించడానికి ఇప్పటికే జిల్లాస్థాయి అధికారుల టీమ్‌లు, పీఓలు, ఏపీఓలు, ఓపీఓలను నియమించారు. పీఓలు 2,552మంది, ఏపీఓలు 2,715, ఓపీఓలు దాదాపు 9వేలు, పోలీసులు దాదాపు 4వేలమంది ఇలా అందరూ కలిపి 25వేలమంది వరకు ఎన్నికల డ్యూటీలో పాల్గొంటున్నారు. ఇవికాకుండా ఎమర్జెన్సీకి సంబంధించి 33 శాఖలకు చెందిన ఉద్యోగులకు పోస్టల్‌బ్యాలెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుంది. ఎన్నికల డ్యూటీకి నియమితులైన పీఓ, ఏపీఓలకు ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగింది. అదేరోజే వారందరితో పోస్టల్‌బ్యాలెట్‌కు వారినుంచి ఫారం-12 డీ దరఖాస్తు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. అయితే శింగనమల, రాయదుర్గం, ఉరవకొండ, రాప్తాడు నియోజకవర్గాల్లో అక్కడ ఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు తమసొంత నిర్ణయాలు తీసుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కేవలం ఆయా నియోజకవర్గాల్లో ఓటు ఉన్నవారితో మాత్రమే దరఖాస్తులు తీసుకున్నారు. ఇతర నియోజకవర్గాల్లో ఓటుఉంటే వారిని ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తారు. ఆ రోజు అక్కడకు వెళితే ఎన్నికల ఆర్డర్, ఫారం-12డీ, ఇస్తే అపుడు పోస్టల్‌బ్యాలెట్ ఇస్తారు అక్కడే మీఓటు వేయవచ్చని చెప్పి పంపారు. ఎన్నికల నిబంధన మాత్రం ఉద్యోగం చేసే నియోజకవర్గంలో ఎన్నికల డ్యూటీ ఆర్డర్, ఫారం-12 దరఖాస్తు ఆ నియోజకవర్గ ఆర్‌ఓలకు ఇవ్వాలి. ఆర్‌ఓలు అక్కడనుంచి ఓటు ఉన్న నియోజవర్గానికి వారి దరఖాస్తులను పంపిస్తారు, అపుడు ఓటు ఉన్న నియోజకవర్గంలో పోస్టల్‌బ్యాలెట్ మంజూరుచేస్తారు. ఏర్పాటు చేసిన పోలింగ్ సెంటర్‌లో ఓటు వేయాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ అలా చేయకుండా ఆర్‌ఓలు ఒక్కోచోట ఒక్కో రకంగా చెప్పడంతో చాలామంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోలింగ్ బ్యాలెట్‌లకు దూరం అయ్యే పరిస్థితి నెలకొంది.

పనిచేసే నియోజకవర్గ ఆర్‌ఓలకే దరఖాస్తు ఇవ్వాలి

పోస్టల్‌బ్యాలెట్ జారీ విషయంలో ఆర్‌ఓలకు స్పష్టంగా సమాచారం ఇచ్చాం. ఏ నియోజకవర్గంలో ఉద్యోగం చేస్తున్నారో ఆ నియోజకవర్గ ఆర్‌ఓలకే పోస్టల్‌బ్యాలెట్‌కు ఫారం-12 దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి ఎవరికి ఏ నియోజకవర్గంలో ఓటు ఉందో అక్కడికి ఆ ఆర్‌ఓ ఫార్వర్డ్ చేసి పంపుతారు. పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన రోజు వెళ్లి అక్కడ బ్యాలెట్ పొంది ఓటు వేయాల్సి ఉంటుం ది. శిక్షణ రోజే పీఓ, ఏపీఓలతో బ్యాలెట్‌కు దరఖాస్తులు తీసుకెళ్లమని చెప్పాం. అయితే కొందరు సరిగా చెప్పకపోవడం వల్ల ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. ఎన్నికల నామినేషన్ల వరకు పోస్టల్ బ్యాలెట్‌లకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది. ఇప్పటికైనా ఎన్నికల డ్యూటీలో ఉన్న వారు పనిచేసే నియోజకవర్గంలో ఆర్‌ఓలను కలిసి దరఖాస్తులు అందించాలి. ఓపీఓలు నియమితులైన వారు మాత్రం నేరుగా ఓటు ఉన్న నియోజకవర్గంలోనే నియామక ఉత్తర్వులు చూపించి దరఖాస్తు చేసుకోవాలి.

- ప్రభాకరరావు, డీపీఓ (పోస్టల్‌బ్యాలెట్ నోడల్ ఆఫీసర్)

ప్రభాకర్ చౌదరికి కీలక బాధ్యతలు

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం
● జోన్-5 ఎన్నికల సమన్వయకర్తగానూ బాధ్యతలు...



అనంతపురం ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరికి కీలక బాధ్యతలు అప్పగించారు. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్ చౌదరిని నియమించారు. ఐదేళ్లపాటు అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా ఆయన వైసీపీ అరాచక పాలనపై అనేక పోరాటాలు చేశారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ నిరాహార దీక్షలు చేశారు. ఈ క్రమంలో అనంతపురం అర్బన్ టిక్కెట్‌ను ఆయన ఆశించారు. కొన్ని కారణాల నేపథ్యంలో ఆ పార్టీ అధినాయకత్వం దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. ఈ పరిస్థితుల్లో వైకుంఠం ప్రభాకర్ చౌదరితోపాటు పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తికి లోనయ్యాయి. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలించిన పార్టీ అధిష్ఠానం ఆ పార్టీలో వైకుంఠం ప్రభాకర్ చౌదరికి జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అంతే కాకుండా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఆయనకు జోన్-5 ఎన్నికల సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ మేరకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇంకా జిల్లాకు చెందిన పలువురు సీనియర్ నాయకులకు పార్టీ రాష్ట్ర కమిటీలోనూ, సార్వత్రిక ఎన్నికల పరిశీలకులు, సమన్వయ కర్తలుగా నియమించారు.

ఎన్నికల పరిశీలకులు, సమన్వయకర్తలుగా పలువురికి బాధ్యతలు


నిమ్మల కిష్టప్ప అనంత పార్లమెంటు సమన్వయకర్త


దాసరి నరసింహమూర్తి పుట్టపర్తి నియోజకవర్గ పరిశీలకుడు


పూల నాగరాజు హిందూపురం పార్లమెంటు సమన్వయకర్త


శివబాల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి

జిల్లాకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులను ఎన్నికల పరిశీలకులుగా, సమన్వయకర్తలుగా నియమించారు. అనంతపురం పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్తగా మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్పను నియమించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శివబాలను నియమించారు. కళ్యాణదుర్గానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు దాసరి నరసింహ మూర్తిని సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజక వర్గం ఎన్నికల పరిశీకుడిగా నియమించారు. రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు, జడ్పీ మాజీ చైర్మన్ పూల నాగరాజుకు హిందూపురం పార్లమెంట్ ఎన్నికల సమన్వయకర్తగా కీలక బాధ్యతలు అప్పగించారు.

పుట్టపర్తిలో వైసీపీకి బిగ్ షాక్

● టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి లోకేశ్ సమక్షంలో వందమంది ముఖ్య నేతల చేరిక

అనంతపురం, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. హిందూపురం పార్లమెంటు కూటమి అభ్యర్థి బీకే పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ కూటమి అభ్యర్థి పల్లె సింధూర నేతృత్వంలో వైసీపీకి చెందిన కీలక నేత, రెస్కో మాజీ చైర్మన శెట్టివారి రాజశేఖర్‌తోపాటు మరో వందమంది ముఖ్యనేతలు టీడీపీలో చేరారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమయంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వీరు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీలో చేరిన వారిలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులున్నారు. వీరందరికి నారా లోకేశ్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పుట్టపర్తిలో కాపు సామాజికవర్గం బలమైన నాయకులుగా రాజశేఖర్ ఉన్నారు. ఈయన 1999లో ఆ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి దాదాపు 14 వేల ఓట్లు తెచ్చుకున్నారు. వైసీపీ నేతలు టీడీపీలో చేరిన సందర్భంగా నారా లోకేశ్ వారినుద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబునాయుడు నేతృత్వంలో కలిసి పనిచేసేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ పార్టీల ముఖ్య నేతలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారన్నారు. పుట్టపర్తిలో టీడీపీ జెండా ఎగురవేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అందరి సేవలను వినియోగించుకుంటామన్నారు. ఇదే సందర్భంలో రెస్కో మాజీ చైర్మన్ రాజశేఖర్ మాట్లాడుతూ ధ్వంసమైన రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాలంటే విజనరీ లీడర్ చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. చంద్రబాబు నేతృత్వంలో కలిసి పనిచేసి పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేస్తామన్నారు.


పార్టీలోకి చేరిన నాయకులతో నారా లోకేశ్, బీకే, పల్లె, సింధూర

టీడీపీలో చేరిన వైసీపీ జడ్పీటీసీ అనూష

● వందలాది కుటుంబాలు కూడా..


వసుంధరా దేవి సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు

చిలమత్తూరు, ఏప్రిల్ 14: మండలంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. బీసీ వర్గానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ గొల్ల అనూషతోపాటు ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వందలాది మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధర దేవి మండలంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం జడ్పీటీసీ అనూష, ఆమె మామ నాగరాజు యాదవ్ వసుంధర దేవిని ఇంటికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు టీడీపీలోకి చేరారు. ఈ సందర్భంగా వసుంధర దేవి మాట్లాడుతూ బీసీ, ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు, మహిళలకు టీడీపీలోనే న్యాయం జరుగుతుందన్నారు. టీడీపీ ఆవిర్భవించిందే బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసమని, వారి క్షేమం కోసం పార్టీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, శ్రీనివాసు, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్విని, డాక్టర్ సురేంద్ర, నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, సుధాకర్, రావిళ్ల లక్ష్మీ నాగరాజు, దేమకేతేపల్లి అంజినప్ప, పరిమళ, మంగేష్, స్థానిక నాయకులు రంగా రెడ్డి, తిప్పారెడ్డి, శ్రీదేవి, బేకరీ గంగాధర్ తదితరలు ఉన్నారు.

బీసీల చూపు.. టీడీపీ వైపు..

● ప్రకాష్‌రెడ్డీ అరమీసం తీసుకునేందుకు సిద్ధంగా ఉండు
● పరిటాల సునీత, శ్రీరామ్

ధర్మవరంరూరల్, ఏప్రిల్14: బీసీల చూపు టీడీపీ వైపు ఉందని, రాప్తాడు ఎన్నికల్లో పరిటాలకుటుంబం గెలిపిస్తే అరమీసం తీసుకుంటానని ఛాలెంజ్‌కు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సిద్దంగా ఉండాలని మాజీమంత్రి పరిటాలసునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌ఛార్జ్ పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. కనగానపల్లిలో ఆదివారం జయహోబీసీ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు స్థానిక సర్పంచ్ అంకే పరిమిళరామకృష్ణ ఇంటివద్దకు వెళ్లారు. వారిని స్వాదరంగా ఆహ్వానించారు. అనంతరం సర్కిల్‌లోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బీసీ సదస్సు కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అంకే పరిమళ రామకృష్ణతోపాటు పాపన్న, రాజేంద్ర, అంకే రామచంద్ర, రామ్మోహన్, తలారిపోతలయ్య, అంకే వన్నూరప్ప, వడ్లచెన్నప్ప, అంకే చంద్ర, నడిపిరాజన్న, బోనాసి ఓబుళపతి, మందలఅంజి, సాకే నాగేష్, పెద్దన్న, అంకే వారాధి, పెద్దనరసింహులు, చీమల నాగభూషణ, అంకే గోవిందు, రామలింగయ్య, అంకే నాగరాజుతోపాటు దాదాపు 300మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు వారి సమక్షంలో పరిటాల సునీత, శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. అదేవిధంగా భానుకోట మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, పల్లారామకృష్ణ, శివారెడ్డి, పల్లానాగేంద్ర, కుంపటికుల్లాయప్ప, వారాధి తదితరులు పార్టీలోకి చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అంతకుమునుపు డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి సొంత కార్యకర్తలకు కూడా న్యాయం చేయలేదన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీకి పనిచేసి రాప్తాడు అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ వైసీపీ ప్రభుత్వంలో అనేకమంది బీసీలు ఇబ్బందులు పెట్టినా, వారిని చంపేసినా సీఎం జగన్‌గానీ, వారి ఎమ్మెల్యేలను గానీ స్పందించినా దాఖాలాలు లేవన్నారు. వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమేనని బీసీలకు పూర్తిగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెంవెంకటేష్, కన్వీనర్‌యాతం పోతలయ్య, ఎంపీటీసీ బిల్లేభాస్కర్, ముకుందనాయుడు, పసల వెంకటేష్, పూజారినాగభూషణం, సుధాకర్‌చౌదరి, బట్టాసురేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు


మాట్లాడుతున్న జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 14: అగ్నిప్రమాదాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు సూచించారు. జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రత్యేక న్యాయాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ.. అగ్నిప్రమాదాలు జరిగినపుడు చాకచక్యంగా వ్యవహరించి అదుపు చేయడంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం అగ్నిమాపక వారోత్సవాల్లో చేపట్టనున్న కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఫైర్ సిబ్బంది చేసిన విన్యాసాలను ఆయన తిలకించారు. ఫైర్ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమలో అసిస్టెంట్ అగ్నిమాపకశాఖ అధికారి లింగమయ్యతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బతో గొర్రెల కాపరి మృతి


గోవిందప్ప మృతదేహం


మడకశిర రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని గోవిందాపురం పంచాయతీ దిగువగొల్లహట్టి గ్రామానికి చెందిన గోవిందప్ప(60) వడదెబ్బ తగిలి మృతి చెందిన ట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గొర్రెల కాపరి అయిన గోవిందప్ప ఆదివారం ఉదయం తన గొర్రెలను మేతకోసం గ్రామ సమీపంలోని కొండ ప్రాంతానికి తోలు కెళ్లాడు. సాయంత్రం 5 గంటలకు గొర్రెలు తిరిగి వచ్చాయి కానీ, గోవిందప్ప రాలే దు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు గొర్రెలు మేతకెళ్లిన ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు రాత్రి 8గంటల సమయంలో కొండప్రాంతంలో గోవిం దప్ప మృతదేహన్ని కనుగొన్నారు. పగలంతా గొర్రెల వెంట ఎండలో తిరగడంతో వడదెబ్బ సోకి కొండప్రాంతంలోనే మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతదేహన్ని గ్రామానికి తీసుకొచ్చినట్లు తెలిపారు.

విద్యుత్ అధికారులపై కేసు

నల్లమాడ, ఏప్రిల్ 14: హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణ శనివారం స్వర్ణాంధ్ర సాకారం యాత్రలో భాగంగా కదిరి నుంచి నల్లమాడ మీదుగా కొత్తచెరువుకు వెళ్లారు. రాత్రి 7:30గంటలకు ఆయన నల్లమాడ క్రాస్ చేరుకున్నారు. ఆ సమయంలో అక్కడ విద్యుత్ పోవడంతో అంధకారం ఏర్పడింది. దీంతో తొక్కిసలాట జరిగింది. కొందరు బాలయ్యతో కరచాలనానికి ఎగబడ్డారు. గమనించిన సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ అందరినీ పక్కకు పంపించేశారు. వెంటనే సీఐ విద్యుత్ సిబ్బందిని పిలిపించి నల్లమాడలో కరెంటు ఉంది, ఇక్కడ ఎందుకు పోయిందని ప్రశ్నించారు. ఉన్నట్టుండి కరెంట్ తీస్తే జనంలో ఎవర్కైనా ఏమైనా జరిగితే ఎవరిది బాధ్యత అని నిలదీశారు. ఇందుకు విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ఆగ్రహించిన సీఐ.. నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందంటూ విద్యుత్ శాఖాధికారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల ప్రచారంలో మరో స్టోర్ డీలర్

అనంతపురంరూరల్, ఏప్రిల్ 14: మండలంలోని స్టోర్ డీలర్ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంది. మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీలోని సుందరయ్య కాలనీ, బీఎస్‌ఆర్ కాలనీ, జాకీర్‌కొట్టాల, సియోన్‌పురం, దండోర కాలనీ, ఆదర్శకాలనీ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పంచాయతీ పరిధిలోని ఆదర్శనగర్ స్టోర్ డీలర్ ప్రమీల పాల్గొన్నారు. ప్రచార వాహనం ఎక్కిమరీ ప్రచారం చేశారు. శుక్రవారం పూలకుంటగ్రామంలో జరిగిన ప్రచారంలో శంకరయ్య అనే స్టోర్ డీలర్ పాల్గొన్నారు.


ప్రకాష్‌రెడ్డి ప్రచార వాహనంలో స్టోర్ డీలర్ ప్రమీల (వృత్తంలో..)

ఘనంగా అంబేడ్కర్ జయంతి

● ఊరూరా ఘననివాళులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి వేడుకలను పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాలవ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద ఘన నివాళులర్పించారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, కుల సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకులతో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులు సైతం జయంతి వేడుకల్లో పాల్గొని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ సమాజంలోని అంటరానితన్నాన్ని నిర్మూలించేందుకు అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన రాజ్యాంగం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని సూచించారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించారు. ధర్మవరంలోని కళాజ్యోతి సర్కిల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్‌యాదవ్ నివాళులర్పించారు. అలాగే తనకల్లు మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ దళిత సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్, నాయకుడు పవన్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య తదితరులు పాల్గొన్నారు. ఆ విగ్రహానికి కందికుంట పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కదిరిపట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కూడా కందికుంట నివాళులర్పించారు.



పుట్టపర్తిలోని జిల్లాపోలీసు కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



కదిరిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కూటమి అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్



ధర్మవరంలో నివాళులర్పిస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్ తదితరులు



ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్డీఓ, అధికారులు



నల్లచెరువులో అంబేడ్కర్ చిత్రపటాన్ని ట్రాక్టర్‌లో ఊరేగిస్తున్న యువత



గాండ్లపెంటలో విగ్రహం వద్ద పలువురి నివాళులు



ఎన్పీకుంటలో చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



ముదిగుబ్బలో విగ్రహం వద్ద నివాళులు..



బుక్కపట్నంలో..



నల్లమాడలో..

వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యం

● ఎన్నికల ప్రచారంలో కందికుంట విమర్శ



ఎన్పీకుంట మండలం కమ్మగుట్టపల్లిలో ఎన్నికల ప్రచారంలో కందికుంట

కదిరిఅర్బన్, ఏప్రిల్ 14: వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, పంచాయతీల పరిస్థితి అయితే మరీ దారుణమని కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని మల్లయ్యగారి పల్లి, తండా, కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కందికుంట ఇంటింటా తిరుగుతూ కూటమి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేశారు. సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయన్నారు. పంచాయతీలలో సర్పంచ్‌లు అధికారాలు పూర్తిగా కోల్పోయారని తెలిపారు. టీడీపీ కూటమి అధికారంలోకి రాగానే పంచాయతీలను బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెన్నకేశవులు, చిన్నానాయుడు, నరసింహారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పలువురు వైసీపీ శ్రేణులు కందికుంట ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. చేరినవారిలో విశ్వనాథ్‌రెడ్డి, జయచంద్ర, విశ్వనాథ్, నవీన్, శీనా, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్‌నాయుడు, రామమూర్తి, చలపతినాయుడు, ఆనంద్, కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, సుబ్బిరెడ్డి తదితరులు ఉన్నారు.



మల్లయ్యగారిపల్లిలో టీడీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కందికుంట

గ్రామాల్లో ముమ్మర ప్రచారం

నంబులపూలకుంట: మండలంలోని గౌకనపల్లి పంచాయతీ కమ్మగుట్టపల్లి, దుద్దుకుంటపల్లి, దిన్నెమీదపల్లి, గౌకనపల్లి గ్రామాల్లో ఆదివారం కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్‌పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ పథకాల వల్ల ప్రతికుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. చంద్రబాబు సీఎం కాగానే పథకాలన్నీ అమలవుతాయన్నారు. సైకిల్ గుర్తుకు ఓటువేయాలని అభ్యర్థించారు. మండలకన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీ, టీడీపీలోకి గిరిజనుల చేరిక



టీడీపీ, బీజేపీలలోకి చేరిన గిరిజనులతో సత్యకుమార్, పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, ఏప్రిల్ 14: మండలంలోని గిరిజన తండాల్లో వైసీపీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అడవిబ్రాహ్మణపల్లి తండా నుంచి 60 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీ, బీజేపీలోకి చేరారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి తుమ్మల మనోహర్, బీజేపీ సీనియర్ నాయకుడు మాలపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో తండావాసులు ఆదివారం ఆయా పార్టీలలోకి చేరారు. బత్తలపల్లి మండలంలో ఎన్నికల ప్రచారంలో ఉన్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వద్దకు వారు వెళ్లి పార్టీల తీర్థం పుచ్చుకున్నారు. వారికి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలలోకి ఆహ్వానించారు. బ్రహ్మదేవరమర్రి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ ఆధ్వర్యంలో బీజేపీలోకి చేరారు. వీరికి సత్యకుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పలు గ్రామాల్లో సత్యకుమార్ ప్రచారం

బత్తలపల్లి: మండలంలోని యర్రాయపల్లి, సంజీవపురం, ముస్టూరు, రాఘవంపల్లి, లింగారెడ్డిపల్లి, వెంకటగారిపల్లి, అనంతసాగరం, చెర్లోపల్లి, చీమలనాగేపల్లి, మాల్యవంతం గ్రామాల్లో ఆదివారం కూటమి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సత్యకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే అన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అలకవీడిన నిమ్మల

గోరంట్ల, ఏప్రిల్ 14: ఎన్నికల్లో తనకు ప్రాధాన్యత కల్పించలేదని అలక బూని పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మల క్రిష్టప్ప ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి సవిత మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో ఆదివారం సాయంత్రం ప్రచారం నిర్వహిస్తుండగా నిమ్మల వెళ్లి ఆమెతోపాటు గ్రామాల్లో పర్యటించారు. కమ్మవారిపల్లి, చెండురూవాండ్లపల్లి, శిరగమవాండ్లపల్లి గ్రామాల్లో ఇంటింటికెళ్లి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడడంతో సంతృప్తి చెందిన నిమ్మల ప్రచారంలో పాల్గొనడంతో అభ్యర్థితో పాటు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ప్రచారంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు పాల్గొన్నారు.

యాతంబావి గంగమ్మకు ప్రత్యేక పూజలు

నల్లచెరువు, ఏప్రిల్ 14: మండలంలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ దేవిరెడ్డిపల్లి వద్ద వెలసిన యాతంబావి గంగమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. గత 42రోజుల క్రితం ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ క్రమంలో ఇప్పుడు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయాన్నే పూజారులు అమ్మవారి విగ్రహాన్ని వెండిఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి జ్యోతులు, బాణాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పెద్దయల్లమ్మపల్లి, దేవిరెడ్డిపల్లి, రమణప్పగారిపల్లి, పెద్దయల్లంపల్లి హరిజనవాడ, ఉప్పార్లపల్లి, వనంవారిపల్లి తదితర గ్రామాల ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు.



పత్యేకాలంకరణలో యాతంబావి గంగమ్మ

రామాలయానికి రూ.25వేలు విరాళం

నల్లచెరువు, ఏప్రిల్ 14: మండలకేంద్రంలో పాత రామాలయాన్ని తొలగించి నూతన ఆలయాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ ఆలయ నిర్మాణానికి టీడీపీ నాయకుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు అబ్దుల్‌ఖాదర్ రూ.25వేలు విరాళం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు కేసీ వెంకటనారాయణ, మురళికి ఆదివారం నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయ నిర్మాణానికి తనవంతు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు

అయ్యప్ప ఆలయంలో విష్ణుపూజ

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 14: మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయంలో ఆదివారం విష్ణుపూజను ఘనంగా నిర్వహించినట్లు ఆలయ పూజారి పచ్చర్ల ఆంజనేయులునాయుడు తెలిపారు. ప్రతియేటా కేరళ నూతన సంవత్సరం సందర్భంగా శబరిమలైలో గల అయ్యప్ప స్వామి సన్నిధిలో స్వామివారికి సుప్రభాత సేవ, పుష్పయాగం, పడిపూజ నిర్వహిస్తారన్నారు. ఈ క్రమంలో ఇక్కడి అయ్యప్ప స్వామి ఆలయంలో పసుపు, కుంకుమ అభిషేక పూజలు, విష్ణుపూజ నిర్వహించినట్లు చెప్పారు. అయ్యప్ప మూలవిరాట్‌కు పట్టువస్త్రాలు , వివిధ పుష్పాలతో అలంకరించి పూజలు చేశామన్నారు.



ప్రత్యేకాలంకరణలో అయ్యప్పస్వామి

ఆదర్శపాఠశాల ప్రవేశ పరీక్ష హాల్‌టికెట్ల విడుదల

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 14: జిల్లాకేంద్రంలోని జగరాజుపల్లి ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఆన్‌లైన్లో ఉంచామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 21వ తేదీ ఆదివారం జరిగే ప్రవేశపరీక్ష ఐదో తరగతి స్థాయిలో ఉంటుందన్నారు. పరీక్ష ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో రాయవచ్చన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. సమయానికి అరగంట ముందే పరీక్ష హాల్‌కు విద్యార్థులు చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్లను cse.ap.gov.in, apms.apcfss.in/studentlogin వెబ్‌సైట్‌లలో హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు పాఠశాల లో సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ధర్మవరం, ఏప్రిల్ 14: పట్టణంలోని కొత్తపేటలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్‌పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. గుట్టకిందపల్లికి చెందిన ఖాదర్‌బాషా బైక్‌లో కొత్తపేటకు వస్తుండగా కొత్తపేట సర్కిల్ వద్ద ఎదురుగా మరో ద్విచక్రవాహనం వచ్చి ఢీకొంది. ప్రమాదంలో ఖాదర్‌బాషా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

17న సీతారాముల కల్యాణం

నల్లచెరువు, ఏప్రిల్ 14: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 17వ తేదీన సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు, ఆలయ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9:30నుంచి 11:30 గంటల వరకు కల్యాణ మహోత్సవం జరుగుందన్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3గంటల వరకు భజనలు, అన్నదానం నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగిన మంటలు

ధర్మవరం, ఏప్రిల్ 14: పట్టణంలోని తేరుబజారులో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఆదివారం మధ్యాహ్నం ఉన్న ఫలంగా మంటలు చెలరేగాయి. ఆ సమయంలో అక్కడ ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించి మెయిన్‌లైన్ ఆఫ్ చేయించారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. వేసవిలో ఎండలు అధికం కావడం వల్ల ట్రాన్స్‌పార్మర్లు సైతం కాలిపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి చెలరేగుతున్న మంటలు

అమరవీరుల స్ఫూర్తిగా అగ్నిమాపక వారోత్సవాలు

● జిల్లా అగ్నిమాపక శాఖాధికారి హేమంత్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్, ఏప్రిల్ 14: విధినిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరుల జ్ఞాపకాల స్ఫూర్తిగా ఈనెల 14నుంచి 20వతేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించనున్నామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి హేమంత్‌రెడ్డి తెలిపారు. జిల్లాకేంద్రంలోని అగ్నిమాపక కేంద్రంలో శనివారం ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని అమరవీరులకు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14న ముంబయ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో విధినిర్వహణలో ప్రాణాలను కోల్పోయిన అమరవీరుల త్యాగాలను స్మరణ చేసుకుంటూ ప్రతి సంవత్సరం ఏడురోజుల పాటు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వారం రోజుల పాటు ఒక్కో రోజు.. ఒక్కోప్రదేశంలో ప్రజలకు అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తామన్నారు. అగ్నిప్రమాదాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయడంలో తమ శాఖ కృషి చేస్తుందన్నారు. ప్రమాదాల్లో ప్రజల ప్రాణాలను కాపాడటమే ధ్యేయంగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపకశాఖాధికారి నాగరాజునాయక్, అగ్నిమాపక కేంద్ర అధికారి మహమ్మద్ సాదిక్, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా అగ్నిమాపక కేంద్రంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న జిల్లా అగ్నిమాపక శాఖాధికారి హేమంత్‌రెడ్డి

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

బుక్కపట్నం, ఏప్రిల్ 14: మండలంలోని యాదాలంకపల్లి పంచాయతీ రామసాగరం గ్రామంలో టీడీపీ నాయకులు ఆదివారం సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఇంటింటికి తిరుగుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్‌సిక్స్ పథకాలు అమలవుతాయని తెలిపారు. వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కూటమి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు శివరాం, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధర్మవరం: పట్టణంలోని 25వ వార్డులో టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ పథకాలపె విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ తిరుగుతూ పథకాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సీఎం అవగానే పథకాలను అమలు చేస్తారని తెలిపారు. కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో సత్యకుమార్‌ను గెలిపిస్తే రాష్ట్రంనుండే కాదు కేంద్రం నుంచి కూడా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు, నాయకులు చీమల రామాంజి, గడ్డంసూరి, చీమలసూరి, క్లస్టర్ రామంజి, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



యాదాలంకపల్లిలో పథకాలపై ప్రచారం చేస్తున్న టీడీపీ శ్రేణులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 14: మండలంలోని తంగేడుకుంట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ సమ్మేళ నం నిర్వహించారు. సుమారు 19 ఏళ్ల తర్వాత వారందరూ తిరిగి అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా.. పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులైన చెన్నారెడ్డి, జయచంద్రారెడ్డి, రాధమ్మ, కృష్ణమూర్తి, జనార్దన్, సురేష్, పఠాన్‌బాబా ఉద్దీన్‌ఖాన్, రవికుమార్, సునీత, రిహాన, మధుసూదన్, కరుణాకర్‌రెడ్డిలను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.




నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి: తెలుగుయువత

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 14: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబుల రెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందన్నారు. సీఎం జగన్‌పై రాయితో దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ మండలకేంద్రంలో వైసీపీ శ్రేణులు రాస్తారోకో చేశారన్నారు. దీంతో ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై ఎన్నికల సంఘం చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

పుట్టపర్తి: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైసీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అంబులెన్సు రమేష్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేస్తే. దానిని టీడీపీ వారు చేశారని వైసీపీ శ్రేణులు రాస్తారోకో నిర్వహించడం ఎన్నికలకోడ్ ఉల్లంఘించడమేనన్నారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కల్పించిన వైసీపీ వారిపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

రేపు ఖమ్రుద్దీన్‌అలీ గంధంపూజ



విద్యుత్ దీపాలంకరణలో ఖమ్రుద్దీన్ అలీ దర్గా

పెనుకొండ, ఏప్రిల్ 14 : పట్టణంలోని గోనిపేట రోడ్డులో వెలసిన షేక్ సయ్యద్‌షా మహ్మద్ ఖమ్రుద్దీన్ అలీ దర్గాలో మంగళవారం ఎంక్యూఎ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గంధంపూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ కలీముల్లా తెలిపారు. కుల మతలాలకు అతీతంగా నిర్వహిస్తామన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎన్నికల కోడ్‌పై నిర్లక్ష్యం



నర్సాంబుదిలో దర్శనమిస్తున్న వైసీపీ బోర్డు

అగళి, ఏప్రిల్ 14 : మండలంలోని నర్సాంబుది గ్రామంలో నేటికీ ఎన్నికల కోడ్ అమలు కాలేదని ప్రజలు అంటున్నారు. 'మా నమ్మకం నువ్వే జగన్' అనే బోర్డు దర్శనమిస్తున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

మడకశిరకు చేరిన ఈవీఎంలు



మడకశిరకు వచ్చిన ఈవీఎంలు ఇవే..

మడకశిరటౌన్, ఏప్రిల్ 14: వచ్చే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల కోసం ఈవీఎం మిషన్‌లు మడకశిరకు ఆదివారం చేరాయి. ఎన్నికల ఆర్‌ఓ గౌరీశంకర్ తదితరుల సమక్షంలో మడకశిర ఎస్‌వైటీఆర్ డిగ్రీ కళాశాలలో వాటిని భద్రపరిరు. మడకశిర నియోజకవర్గంలో 241 పోలింగ్ బూత్‌లు ఉండగా అసెంబ్లీకి సంబంధించి 289 ఈవీఎంలు, పార్లమెంట్‌కు సంబంధించి 291 ఈవీఎంలు మడకశిరకు చేరాయి. వాటిని కళాశాలలోని ఓ గదిలో భద్రపరిచారు. వివిధ పార్టీల నాయకులు , అధికారుల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు. ఈసందర్భంగా తహసీల్దార్ వెంకటేశులు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ మారుతీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వడదెబ్బ సోకి మహిళకు అస్వస్థత

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 14 : మండలంలోని కోనాపురంలో వడదెబ్బసోకి హరిజన అంజనమ్మ అనే వృద్ధురాలు తీవ్ర అస్వస్థతకు గురైంది. గ్రామానికి చెందిన ఆమె ఆదివారం చింతకాయలు ఏరేందుకు కూలీగా వెళ్లింది. ఈ క్రమంలో మధ్యాహ్న సమయంలో ఎండ వేడిమి తట్టుకోలేక అంజనమ్మ ఉన్నఫలంగా కుప్పకూలిపోయింది. స్థానికులు హుటాహుటిన 108సాయంతో పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు.

చెక్‌పోస్టులో రూ.2లక్షల నగదు స్వాధీనం



పట్టుబడిన డబ్బు చూపుతున్న పోలీసులు

పావగడ, ఏప్రిల్ 14: ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన కంబదూరు, నాగలాపురం చెక్‌పోస్టులో ఆదివారం రూ.2లక్షల నగదును కర్ణాటక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ కంబదూరు నుంచి ఒక కారులో వస్తున్న ఇద్దరు వ్యక్తులను చెక్‌పోస్టులో తనిఖీ చేశారు. వారివద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.2లక్షల నగదు ఉండటంతో పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మాళప్ప తెలిపారు.

రెడ్డిపల్లిలో దాహం దాహం

రొద్దం, ఏప్రిల్ 14 : మండలపరిధిలోని రెడ్డిపల్లిలో ఓ ప్రాంతం ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిధిలోని రెడ్డిపల్లిలో దొడగట్ట - రొద్దం ప్రధాన రహదారి పక్కన దాదాపు 25 ఇళ్ల వారు నివాసం ఉంటున్నారు. ఆ ఇళ్లకు కొద్ది రోజులుగా నీరు సరఫరా కావడం లేదు. ఎండకాలం కావడతో గ్రామంలోని బోరు బావుల్లో నీటి మట్టం తగ్గింది. దీనికి తోడు ఆ ఇళ్ల మిట్ట ప్రాంతంలో ఉండడంతో వారికి సరిగా నీరు సరఫరా కావడంలేదు. దీంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైక్‌లు, సైకిళ్ల, ఆటోల ద్వారా వ్యవసాయ బావులు, పక్క గ్రామాల నుంచి నీటిని తెచ్చుకుంటున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.. ఎన్నిమార్లు సచివాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. సోలార్ సిస్టం ట్యాంకు మరమ్మతులు చేసినా నీటి సమస్య తీరలేదన్నారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రెడ్డిపల్లిలో ద్విచక్రవాహనంపై నీటిని తీసుకెళ్తున్న దృశ్యం



పరిగిలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేస్తున్న టీడీపీ నాయకులు



చిలమత్తూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వసుంధరా దేవి



గోరంట్లలో అంబేద్కర్ జయంతిలో పాల్గొన్న సవిత

ఘనంగా అంబేడ్కర్ జయంతి

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

రాజ్యాం నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతిని ఆదివారం ఘనంగా జరపుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చుదాం : వసుంధరాదేవి

చిలమత్తూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి నందమూరి వసుంధరా దేవి అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అణగారిన వర్గాలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో అందరం నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి బేకరీ గంగాధర్, ఆటో సజ్జప్ప, దేమకేతేపల్లి అంజినప్ప, రంగారెడ్డి, గంగప్ప తదితరలు ఉన్నారు.



రొళ్లలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి సుధాకర్ తదితరులు



మడకశిరలో నివాళులర్పిస్తున్న గుండుమల తిప్పేస్వామి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సునీల్‌కుమార్ తదితరులు



పెనుకొండలో అంబేడ్కర్ విగ్రహం వద్ద పురస్కారాలు అందుకున్న పట్టభద్రులు



రొద్దంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్‌కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు



గుడిబండ మండలం సిసిగిరిలో అంబేడ్కర్ జయంతి



పెనుకొండలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు



అగళిలో నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ ఉమేష్ తదితరులు



లేపాక్షిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

టీడీపీ గెలిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి

చిలమత్తూరు, ఏప్రిల్ 14: వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాన్ని మంచి భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి పేర్కొన్నారు. మండలంలో ఆమె ఎన్నికల ప్రచారం రెండో రోజు ఆదివారం జోరుగా సాగింది. ఉదయం 8 గంటలకే ప్రచారం మొదలుపెట్టారు. ముందుగా శెట్టిపల్లి పంచాయతీలోని అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రజలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళలతో ముచ్చటిస్తూ ఈ ఎన్నికల్లో టీడీపీని ఆదరించాలన్నారు. హిందూపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి బాలకృష్ణను, ఎంపీ అభ్యర్థి పార్థసారథిని గెలిపించాలని కోరారు. టీడీపీ ఈ ఎన్నికల్లో గెలిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని, హిందూపురంలో బాలకృష్ణ గెలిస్తేనే మన గ్రామాలు బాగుపడతా యన్నారు. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉదయం 10 గంటలకే ఎండలు మండుతున్నా ఆమె ఎన్నికల ప్రచారం ఎక్కడా ఆపలేదు. ఈ సందర్భంగా ఆమె రోడ్ షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శెట్టిపల్లి తరువాత కోడూరు పంచాయతీ కంబాలపల్లి, కొడికొండ, మరసనపల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె వెంట ఎమ్మెల్యే బాలకృష్ణ సోదరి లోకేశ్వరి, శ్రీనివాసు, ఐటీ ప్రొఫెషనల్ వింగ్ ప్రతినిధి తేజశ్వని, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, డాక్టర్ సురేంద్ర, నాయకులు అంజనప్ప, రంగారెడ్డి, బేకరీ గంగాధర్, శ్రీదేవి తదితరలు ఉన్నారు.



శెట్టిపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వసుంధరా దేవి

బాబు ముందు చూపు వల్లే జిల్లాకు పరిశ్రమలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

మడకశిరటౌన్, ఏప్రిల్ 14: చంద్రబాబు ముందు చూపు వల్ల కియ తదితర పరిశ్రమలు జిల్లాకు వచ్చాయని, రాష్ట్రంతో పాటు మడకశిర ప్రాంతం బాగుపడాలంటే టీడీపీ అధినే చంద్రబాబుతోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. బెంగళూరు టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం బెంగళూరులోని బగలగుంట ప్రాంతంలో ఉన్న శ్రీసాయి కల్యాణ మండపంలో బాబు కోసం మేముసైతం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న, బీజేపీ కర్ణాటక ఎమ్మెల్యే మునిరాజు, విశ్వనాథ్ తదితరులతో కలిసి సునీల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చంద్రబాబు ముందు చూపు వల్ల కియ తదితర పరిశ్రమలు జిల్లాకు వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఒక్క పరిశ్రమ కూడా నెలకొల్పలేదని, యువతకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. దీంతో మడకశిర ప్రాంతం నుంచి అనేక మంది బెంగళూరుకు వలస వచ్చి ఉపాధి పొందుతున్నారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినవెంటనే మడకశిర ప్రాంతంలో సైతం పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. యువత ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లి అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మడకశిర నియోజకవర్గంలో టీడీపీ విజయానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వీఎంపాండురంగప్ప, మాజీ జడ్పీటీసీలు రామకృష్ణయాదవ్, నరసింహమూర్తి, మాజీ ఎంపీపీ ఆదినారాయణ, నాయకులు సురేష్, జయరామరెడ్డి, సాగర్, రాజగోపాల్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

పెనుకొండ టౌన్(సోమందేపల్లి), ఏప్రిల్ 14 : మండలకేంద్రమైన సోమందేపల్లిలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్‌చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పేకాడుతున్న సమాచారం అందుకుని ఆదివారం దాడులు చేశామన్నారు. వారి వద్ద రూ.6600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసి వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

మీ బెదరింపులకు బెదరం: జడ్పీటీసీ అనూష

చిలమత్తూరు, ఏప్రిల్ 14: 'మీ బెదిరింపులకు భయపడేవారు ఎవరూ ఇక్కడ లేరు. త్వరలో మీ వైసీపీ పార్టీ ఖాళీ అవుతుంది'. అని ఆదివారం నందమూరి వసుంధర దేవి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన జడ్పీటీసీ అనూష వైసీపీ నాయకులను ఘాటుగా హెచ్చరించారు. తాను ప్రజల ఆదరాభిమానాలతో జడ్పీటీసీగా గెలిచానని, ప్రస్తుతం ఎంపీపీగా ఉన్న వ్యక్తే తనను జడ్పీటీసీగా ఓడించడానికి కంకణం కట్టుకొని పనిచేశారన్నారు. ఇప్పుడు తమ ఇంటి వద్దకు అర్ధ రాత్రి సమయంలో రౌడీ మూకలను పంపి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. త్వరలో వైసీపీ ఖాళీ అవడం ఖాయమని, ఈ ఎన్నికల్లో మీ పప్పులు ఉడకవని వైసీపీ నాయకులను హెచ్చరించారు.

'సూపర్‌సిక్స్'పై టీడీపీ నాయకుల ప్రచారం

హిందూపురం, ఏప్రిల్ 14 : మండలంలోని గోళ్లాపురంలో ఆదివారం టీడీపీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ ఆదినారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని పంచాయతీల నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ మండల కన్వీనర్ అశ్వత్థనారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ హెచ్‌ఎన్ రాము, హనుమం తరాయుడు, నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, ప్రదీప్, గోపాల్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, బాలప్ప, అంజి, మూర్తి, టీజీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు సాయం అందిస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని లోచర్ల, కొత్తూరు, కంచిసముద్రం గ్రామాల్లో టీడీపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు నరసింహులు, జీవీపీ నాయుడు, చిన్నప్పయ్య, వెంకటరామిరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులు, పవన్, మాధవనాయుడు, టైలర్ ఆంజనేయులు, తులసీ, చంద్రమౌళి, కన్వీనర్ నరహరి, శ్రీనాథ్‌చౌదరి, ఉగ్గీరప్ప, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ రూరల్: టీడీపీ అధికారంలోకి రాగానే పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరిస్తామని మాజీ ఎంపీపీ కేశవయ్య పేర్కొన్నారు. మండలంలోని శెట్టిపల్లిలో ఆదివారం టీడీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ సిద్దయ్య, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములుయాదవ్, లక్ష్మీనారాయణరెడ్డి, పోతిరెడ్డి, రమేష్‌నాయుడు, బాబుల్‌రెడ్డి, వీజీపాళ్యం శీన, బోయనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం

అగళి, ఏప్రిల్ 14 : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు నీలకంఠాపురం రఘువీరారెడ్డి పేర్కొన్నారు. అగళి మండలంలోని నరసాంబుది, కోడిపల్లి, రామనపల్లి, హళ్లికెర గ్రామ పంచాయతీలోని గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ లోకేష్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్ , నాయకులు శ్రీనివాస్ , త్యాగరాజు, రంగనాథప్ప, నరసప్ప, మారుతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే గ్రామాల అభివృద్ధి

టీడీపీ కూటమి అభ్యర్థి సవిత



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న సవిత

గోరంట్ల, ఏప్రిల్ 14: రాష్ట్రాభివృద్ధి, గ్రామాల సర్వతోముఖాభివృద్ధి, మహిళ సాధికారత టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ కూటమి అభ్యర్థి సవిత పేర్కొన్నారు. మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ గ్రామాల్లో ఆమె ఇంటింటికెళ్లి ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వైసీపీ ఐదేళ్ల పాలనలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప గ్రామాల అభివృద్ధికి కృషిచేశారా అని ప్రశ్నించారు. అక్రమంగా ఆర్జించిన డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని వైసీపీ చూస్తోందన్నారు. భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే మళ్లీ పొరపాట చేయవద్దన్నారు. కియా, నాసిన్ తదితర పరిశ్రమల ద్వారా చంద్రబాబు యువతకు, మహిళలకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించారన్నారు. ప్రపంచస్థాయిలో విజన్ ఉన్న చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎంపీ అభ్యర్థి బీకే పార్థసారథిని, తనను ఆదరిస్తే, ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. అనంతరం గోరంట్లలోని శివాలయంలో ఆమె బలిజ సంఘం వారితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే గోరంట్లలో శ్రీకృష్ణదేవరాయుల విగ్రహం ఏర్పాటు చేయిస్తామన్నారు. వారి మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అశ్వత్థరెడ్డి, సుధాకర్‌రెడ్డి, నీలకంఠరెడ్డి, ప్రభావతి, సోముశేఖర్, అశోక్, నరేంద్రరాయల్,పట్టాభి, శేఖర్, వెంకటేష్, మల్లికార్జున, మణిశేఖర్‌రెడ్డి, బాలక్రిష్ణచౌదరి, నరేష్, వృషభ, రామమోహన్ వాల్మీకి సోము, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అలకవీడి ప్రచారంలో పాల్గొన్న నిమ్మల

గోరంట్ల, ఏప్రిల్ 14: ఎన్నికల్లో తనకు ప్రాధాన్యత కల్పించలేదని అలకబూని పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉన్న మాజీ ఎంపీ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిమ్మల క్రిష్టప్ప ఆదివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. టీడీపీ కూటమి అభ్యర్థి సవిత మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలో ఆదివారం సాయంత్రం ప్రచారం నిర్వహిస్తుండగా నిమ్మల వెళ్లి ఆమెతోపాటు గ్రామాల్లో పర్యటించారు. కమ్మవారిపల్లి, చెండురూవాండ్లపల్లి, శిరగమవాండ్లపల్లి గ్రామాల్లో ఇంటింటికెళ్లి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడడంతో సంతృప్తి చెందిన నిమ్మల ప్రచారంలో పాల్గొనడంతో అభ్యర్థితో పాటు పార్టీ శ్రేణుల్లో నూతనోత్సహం వెల్లివిరిసింది. ప్రచారంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహరావు పాల్గొన్నారు.

పేరుకుపోయిన డ్రైనేజీలు

- ప్రధాన రహదారిపైకి చేరుతున్న మురుగునీరు
- దుర్గంధం, దోమలతో గ్రామీణుల ఇబ్బందులు

మడకశిర రూరల్, ఏప్రిల్ 14: మండలంలోని గ్రామాల్లో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు. పంచాయతీ, సచివాలయ అధికారులు ఎన్నిల విధుల్లో బీజీగా ఉండడంలో గ్రామాల పరిశుభ్రతను మరిచారని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో డ్రైనేజీలు కంపు కొడుతున్నాయని, దోమలు రోజురోజుకు విజృంభిస్తున్నాయని వాపోతున్నారు. మండలంలోని ఒంటి పాళ్యం, క్యాంపురం తదితర గ్రా మాల్లోని డ్రైనేజీలు చెత్తచెదా రంతో నిండిపోయాయి. దీంతో మురుగునీరు ముందుకు వెళ్లలేక ప్రధాన రహదారిలోకి చేరి నిల్వ ఉంటోంది. దుర్గంధం వెదజల్లుతోంది. దోమలకు ఆవాసంగా మారుతోంది. దుర్గంధం, దోమల విజృంభణ భరించలేక ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటిలో వెళ్లలేక వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని బీ రాయాపురం గ్రామంలో నడిరోడ్డుపైన మురుగునీరు ప్రవహిస్తోంది. మణూరు రంగాపురం ఎస్సీ కాలనీలో కాలనీ మధ్యన ఆ మురుగునీరు నిల్వఉండి దుర్వాసన వస్తోందని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. గౌడనహళ్ళి, గోవిందాపురం తదితర గ్రామాల్లో పరిస్థితి అలాగే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని వెంటనే డ్రైనేజీలను శుభ్రం చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ఒంటిపాళ్యంలో నడిరోడ్డులో నిల్వఉన్న మురుగునీరు



బీ రాయాపురంలో నడిరోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు